
సాక్షి
అనంతపురం

శుక్రవారం । 20 । జూన్ । 2025



టన్ను చీనీ రూ.29,100

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.29,100 వేల ప్రకారం ధర పలికాయి.



నత్తే నయం

పీఏబీఆర్, ఎంపీఆర్ రెగ్యులేటర్ల నిర్మాణ పనులు సా..గుతున్నాయి. నత్తతో పోటీ పడుతున్నాయి.

10లో

గరిష్టం/కనిష్టం
36.7°/24.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

డయాలసిస్ రోగులకు తప్పిన విద్యుత్ కష్టాలు



గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు

సాక్షి స్పందన

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ రోగులకు ఎట్టకేలకు విద్యుత్ కష్టాలు తప్పాయి. ఆస్పత్రిలో నెలకొన్న దుస్థితిపై ఈ నెల 17న 'సాక్షి'లో 'పాలకుల నిర్లక్ష్యం..ప్రాణ సంకటం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ సమస్యను పరిష్కరించాలని డీసీహెచ్‌ఎస్ పాల్ రవి కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమం లోనే గుంతకల్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావుతో డీసీహెచ్‌ఎస్ మాట్లా డారు.డయాలసిస్ సెంటర్‌కు జనరేటర్ కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈ విషయమై అజేంద్రరావు 'సాక్షి'తో మాట్లాడుతూ డయాల సిస్ సెంటర్‌ను రాహి కేర్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయ న్నారు. జనరేటర్ కనెక్షన్ ఇవ్వడంతో విద్యుత్ సమస్య తీరినట్లేనన్నారు. జనరేటర్‌కు అవసర మైన డీజిల్‌ను రాహి కేర్ ప్రైవేట్ లిమిటెడ్ వారే భరించాల్సి ఉంటుందన్నారు.

ఐటీఐ రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని బాలుర ఐటీఐ ప్రవేశాలకు మొదటి విడతలో పూర్త యిన తర్వాత రెండో విడత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాయపరెడ్డి కోరారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసిన తర్వాత ఒరిజినల్ సర్టిఫికెట్లు జూలై 17 మధ్యాహ్నం ఒంటి గంటలోపు వెరిఫికేషన్ చేయించుకో వాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించు కున్న దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్లకు అర్హత పొందుతాయని స్పష్టం చేశారు. జూలై 21, 22 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. https://iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాయప రెడ్డి సూచించారు.

టీబీ డ్యాంకు 43,706 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: జిల్లా ప్రజలకు హెచ్చెల్సీ (ఎగువ) ద్వారా తాగు, సాగు నీరందించే తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తింది. గురువారం సాయంత్రానికి 43,706 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు టీబీ బోర్డు అధికారులు తెలిపారు. కొన్ని రోజులుగా డ్యాం ఎగువ భాగంలోని శివమొగ్గ,ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఇన్‌ఫ్లో మొద లైంది. 10 రోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. మే మొదటి వారం లో జీరోగా ఉన్న ఇన్‌ఫ్లో.. నేడు 43,706 క్యూసెక్కులుగా నమోదవుతుండడం గమ నార్హం. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1,608.23 అడుగు లకు చేరుకుంది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 34.220 టీఎం సీల నీరు నిల్వ ఉంది. ఇంకా వర్షాలు కురు స్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవ కాశం ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

పీపీ పదవికి హరినాథరెడ్డి రాజీనామా



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాచ మల్లు హరినాథరెడ్డి తన పదవికి గురు వారం రాజీనామా చేశారు. 2019 డిసెం బర్ 21న ఆయన జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమి తులయ్యారు. రాజీనామా చేసిన అనంతరం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాను పీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గట్టిగా వాదించి దోషులకు శిక్షలు పడేలా చేశామ న్నారు. తనను తొలగించాలని ఇటీవల ప్రభుత్వానికి కొందరు సిఫార్సు చేశారని, అయితే, ఈ విషయంలో తనకేమీ బాధ లేదన్నారు. తొలగించాల్సిన అవసరం లేకుం డానే తానే పదవికి రాజీనామా చేస్తున్నాన న్నారు. రాజీనామాను ఆమోదించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌ను కోరినట్లు వెల్లడించారు.

కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఆగమేఘాలపై చేపడుతున్న హంద్రీ–నీవా లైనింగ్ పనులు తెలుగు తమ్ముళ్లకు ఆదాయ వనరుగా మారాయి. తమకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నా సీఎం చంద్రబాబు నిధుల పందేరానికి తెరలేపారు. అసలు లైనింగే వద్దంటుంటే ఆపై నాసిరకంగా పనులు చేస్తూ రూ. కోట్లు కొట్టేస్తున్నారు.

నాణ్యతకు తూట్లు.. జేబుల్లోకి కోట్లు

పంపనూరు వద్ద కార్మికులతో లైనింగ్ పనులు చేపడుతున్న దృశ్యం



- నాసిరకంగా హంద్రీ–నీవా లైనింగ్
- ఇష్టారాజ్యంగా పనులు
- అప్పుడే పలుచోట్ల కంకర తేలిన వైనం
- రైతులు వ్యతిరేకిస్తున్నా లైనింగ్‌కు తెరలేపిన బాబు సర్కారు
- కాంట్రాక్టర్లందరూ టీడీపీ నేతలే

సాక్షి ప్రతినిధి, అనంతపురం/ఆత్మకూరు: కరువు పీడిత రాయలసీమను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో దివంగత నేత వైఎస్సార్ హంద్రీ–నీవా ప్రాజెక్టును చేపట్టి దాదాపు 90 శాతం పనులను తన హయాంలోనే పూర్తి చేయించారు. కాలువలో జలాలు పారడంతో ఆ మార్గంలోని భూముల్లో నీటి లభ్యత పెరిగి బోరు బావుల్లో నీరు సమృద్ధిగా లభించేవి. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ హంద్రీ–నీవా కాలువ సామర్థ్యాన్ని 83 టీఎంసీలకు పెంచుతూ అనుమతులు ఇచ్చారు. కానీ ఎన్నికల కోడ్ వచ్చే సరికి ఆ పనులు ముందుకు సాగలేదు.

నాసిరకంగా పనులు..

కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పానికి కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు కాలువ లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. లైనింగ్ వల్ల బోరు బావుల్లో నీటి లభ్యత తగ్గి భూములు బీళ్లుగా మారే అవకాశం ఉంది. ఈ క్రమంలో లైనింగ్ చేయకూడదని ఒక వైపు రైతులు వాపోతుంటే... కూటమి ప్రభుత్వం మాత్రం 'తమ్ముళ్ల' జేబులు నింపడానికి పనులకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 183 కిలో మీటర్ల మేర చేపట్టాల్సిన పనులను 7 ప్యాకేజీలుగా విభజించింది. 1 నుంచి 5వ ప్యాకేజీ వరకు రూ.936.70 కోట్లు, 6,7 ప్యాకేజీలకు రూ.319 కోట్ల ఖర్చుతో పనులు అప్పగించింది. 1,2,3 ప్యాకేజీలు ఆర్‌వీఆర్ కంపెనీ, 4,5 ప్యాకేజీలు బీఎస్ఆర్ కంపెనీ, 6,7 ప్యాకేజీల పనులు ఎస్ఆర్‌సీ కంపెనీ వాళ్లు దక్కించుకున్నారు.



కాలువ పక్కన అటవీ ప్రాంతంలో కొండను తవ్వి కంకరకు రాళ్లు తీసిన దృశ్యం

ఇష్టారాజ్యంగా పనులు..

హంద్రీ–నీవా లైనింగ్ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. సిమెంట్ తక్కువగా వేయడంతో అప్పుడే ఇసుక, కంకర తేలి కనిపిస్తోంది. పూర్తిగా మిషన్లతో పనులు చేపట్టాల్సి ఉన్నా.. దీనికి విరుద్ధంగా కార్మికులతో చేయిస్తున్నారు. ఇక.. లైనింగ్ పనులకు కాంక్రీట్ వేయాలంటే కంకర తప్పనిసరిగా ఉండాలి. కానీ ఆత్మకూరు మండలం లోని పంపనూరు తండా గ్రామం వద్ద హంద్రీ–నీవా కాలువ పక్కనే మొబైల్ క్రషర్ ఏర్పాటు చేసి కాలువలో ఉన్న రాళ్లతో పాటు పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోని కొండ నుంచి రాళ్లను తరలించి కంకర మిషన్‌లోకి వేస్తున్నట్లు తెలిసింది. దీనికితోడు మొబైల్ క్రషర్‌కు అధికారులు అనుమతి ఇచ్చారా అనేది కూడా తెలియడం లేదు. కొండలోని రాళ్లను ఎలా కంకరగా తయారు చేసి వినియోగిస్తా రనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.



నాసిరకంగా లైనింగ్ వేయడంతో కంకర తేలిన దృశ్యం

జేబులు నింపుకోవడానికే..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించ తలపెట్టిన గండికోట– గాలేరు నగరి, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు బ్రాంచ్‌కెనాల్ లిఫ్ట్ ఇరిగే షన్ ప్రాజెక్టులు చేపడితే హంద్రీ–నీవా లైనింగ్‌తో పనే ఉండదు. అయినా.. ఆ ప్రాజెక్టులను రద్దు చేసి కేవలం తమ్ముళ్ల జేబులు నింపడానికి చంద్ర బాబు ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి. హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయకుండా, పిల్ల కాలువలు ఏర్పాటు చేసి నీరు ఇవ్వకుండా లైనింగ్ పనులకు తెరలేపిన చంద్రబాబు ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతు న్నారు. తమకు అన్యాయం చేస్తూ ఎవరి జేబులు నింపడానికి ఇలా చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో తమకు కష్టాలు తప్పవేమో అంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూమి బీడుగా మారుతుంది



నాకు కాలువ పక్కన ఐదెకరాల పొలం ఉంది. ప్రస్తుతం రెండు బోర్లు వేసి పంట సాగు చేస్తున్నా. కాలువకు లైనింగ్ వేస్తే భూమి లోపలికి నీరు ఇంకే అవ కాశం ఉండదు. బోర్లు ఎండిపోతాయని భయం గా ఉంది. గతంలో పంటలు పండక వలస వెళ్లే వాళ్లం. వైఎస్సార్ చలువతో కాలువ నీటితో పంటలు పండించుకుంటున్నాం. చంద్రబాబు లైనింగ్ వేసి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు.

– వెంకట నాయక్, పంపనూరు తండా, ఆత్మకూరు మండలం

మళ్లీ వలసలు తప్పవేమో?



గతంలో సాగునీరు లేక వలసలు వెళ్లేవాళ్లం. వైఎస్సార్ పుణ్యమా అని నీరు వచ్చాక ఉన్న ఊర్లోనే వ్యవసాయం చేసుకుంటున్నాం. తాజాగా కాలువకు లైనింగ్ వేస్తున్నారు. లైనింగ్ వేస్తే బోర్లలో నీటి లభ్యత తగ్గుతుంది. ఈ క్రమంలో మళ్లీ వలసలు తప్పవేమో అని భయమేస్తోంది.

– పోలన్న, సింగంపల్లి, ఆత్మకూరు మండలం

రైతులకు అన్యాయం



మా గ్రామస్తులంతా దాదాపు వ్యవసాయం పైనే ఆధారపడి బతుకు తున్నాం. మాకు పంటల సాగు తప్ప ఇంకేమీ తెలియదు. ఇప్పుడు బోర్లు ఎండి పోతే పంటలు పండవు. రైతులకు అన్యాయం చేయడానికే చంద్రబాబు ప్రభుత్వం కాలువకు కాంక్రీట్ వేస్తోంది.

– మన్నల లక్ష్మిదేవి, సింగంపల్లి, ఆత్మకూరు మండలం

ఉపాధిని సద్వినియోగం చేసుకోండి

యల్లనూరు: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృంద సభ్యులు సూచిం చారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను గురువారం కేంద్ర బృంద సభ్యులు నవనీత, నాబార్డు కన్సల్టెంట్ వెంకటేశ్వర్లు, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్‌లు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండలంలో తిమ్మంపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో 6 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లారు.చింతకాయ మంద వద్ద రూ. 35 లక్షల నిధులతో 1.6 కిలోమీ టర్ల మేర నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీ లించారు. పశువుల నీటి తొట్టెలు,ఫారం పాండ్లు, కందకం పనులపై అడిషనల్ కమిషనర్ శివ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏ పనికి ఎన్ని నిధులను మంజూరు చేశారు.. ఎంత ఖర్చు చేశారు తదితర వివరాలపై ఆరా తీశారు. ఫారం పాండ్ల వద్ద మొక్కలు నాటారు. రైతులతో కాసేపు మాట్లాడారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడ్డంవారిపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో కేంద్ర బృంద సభ్యురాలు నవనీత మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ఆవశ్యకతను వివరించారు. అనంతరం తిమ్మంపల్లి సచివాల యం తనిఖీ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీం భాష, పంచాయతీ రాజ్ డీఈ కృష్ణ జ్యోతి, ఏపీడీ పుల్లా రెడ్డి, ఎంపీడీఓ కరుణ సాగర్, ఈసీ సత్య మూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ జయరాం, పురుషోత్తం నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, హరి కుమార్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులపై చర్చిస్తున్న కేంద్ర బృందం

ఆత్మకూరులో..

ఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలో చేప ట్టిన ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం పరి శీలించింది. పనులు ఎంత మేర చేశారు.. ఏ పనికి ఎంత కూలీ వర్తిస్తోంది తదితర వివరాలను బృంద సభ్యులు నవనీత్ దాస్, శంకర్, గౌతమ్ అడిగి తెలుసుకున్నారు. పర్కులేషన్ ట్యాంక్, హార్టికల్చర్ పనులను పరిశీలించారు. కార్య క్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి ఏపీఓ వెంకటనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

డీఆర్‌ఓ మలోలకు పదోన్నతి



అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోలకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో మలోల ప్రస్తుతం డీఆర్‌ఓగా విధులు నిర్వర్తి స్తున్నారు. ప్యానల్ ఇయర్ 2021–22కు చెందిన ఆయనకు పదోన్నతి కల్పించారు.

పీఏబీఆర్ సందర్శన

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)ను గురువారం జల్‌శక్తి అభియాన్ సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు గౌతమ్, డిప్యూటీ డైరెక్టర్ శంకర్ సందర్శించారు. డ్యాంలో నీటి నిల్వ సామర్థ్యం ఎంత.. ఎక్కడి నుంచి నీరు సరఫరా అవుతోంది.. ఎలా వినియోగిస్తు న్నారు తదితర అంశాలపై ఇరిగేషన్ అధికా రులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇరిగే షన్ ఈఈ శశిరేఖ మాట్లాడుతూ డ్యాం కెపా సిటీ 11 టీఎంసీలని పేర్కొన్నారు. తుంగ భద్ర, జీడిపల్లి జలాశయాల నుంచి కాలువల ద్వారా, ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి నప్పుడు వరద రూపంలో నీరు వచ్చి డ్యాంలో చేరుతుందని వివరించారు. ఇప్పటి వరకు సుమారు 5.5 టీఎంసీల నీరు నిల్వ ఉంచామన్నారు. సత్యసాయి, అనంతపురం, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజె క్టుల ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో వందలాది గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతున్నట్లు చెప్పారు. ధర్మవరం కుడి కాలువ ద్వారా 49 చెరువులకు నీటిని సర ఫరా చేస్తామని తద్వారా ప్రజలకు, రైతులకు తాగు, సాగునీరు అందుతోందన్నారు. డ్యాం వద్ద ఏర్పాటైన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ తయారీకి నీటిని వినియోగిస్తామ న్నారు. ప్రస్తుతం అవుట్ ఫ్లో 120 క్యూసెక్కు లున్నట్లు కేంద్ర బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈలు వెంకట రమణ,ఉదయ సేనయ్,ఏఈఈలు లక్ష్మీదేవి, రామకృష్ణ, ముత్యాలప్ప, శాస్త్రి, గంగమ్మ, వెంకటరమణ, రేణుక పాల్గొన్నారు.

5,967 కేంద్రాల్లో యోగా దినోత్సవం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న జిల్లావ్యాప్తంగా 5,967 రిజిస్టర్ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వెల్లడించారు. 10 లక్షల మందితో యోగా దినోత్సవం నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో విలేక రులతో ఆయన మాట్లాడారు.జిల్లాలో 'యోగాంధ్ర' కింద 9,97,518 మంది రిజిస్టర్ చేసుకున్నార న్నారు. జిల్లావ్యాప్తంగా 100 మంది మాస్టర్ ట్రైనర్లు, 6,504 మంది ట్రైనర్లు రిజిస్టర్ అయ్యార న్నారు. 21న ఉదయం 7 గంటలకు జిల్లాలో రిజిస్టర్ అయిన కేంద్రాల్లో యోగా ప్రదర్శన ఉంటుందన్నారు. జిల్లాస్థాయి కార్యక్రమంలో పీటీసీ మైదానంలో 5 వేల మంది పాల్గొంటార న్నారు. 'యోగాంధ్ర' రాష్ట్రస్థాయి పోటీల్లో వివిధ కేటగిరీల్లో జిల్లాకు చెందిన 27 మంది బహు మతులు సాధించారన్నారు. 21న విశాఖపట్నంలో ప్రధానమంత్రి పాల్గొనే కార్యక్రమంలో వారంతా పాల్గొంటారన్నారు. జిల్లావ్యాప్తంగా రిజిస్టర్ అయిన పౌరులందరూ పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారా యణ్ శర్మ, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి రామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ

గురుకులాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీ సత్యసాయి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6–9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మీ తెలిపారు. జిల్లా కార్యాలయం లేదా గురుకుల పాఠశాలల్లో ఈనెల 23లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. అనంత పురం జిల్లాలో ఖాళీలు లేవన్నారు. బాలికలకు హిందూపురం బాలికల పాఠశాల, బాలురకు హిందూ పురం బాలుర పాఠశాలల్లో పరీక్షలు ఉంటాయన్నారు.

ఖాళీలు రోస్టర్ వారీగా ఇలా...

6వ తరగతిలో..కాళసముద్రం పాఠశాలలో బీసీ–1, మలుగూరు ఎస్సీ (గ్రూప్–3)–2, నల్లమాడలో ఎస్సీ (గ్రూప్–3)–2, ఎస్టీ–2, ఓసీ–1, అమరాపు రంలో ఎస్సీ (గ్రూప్–3)–1, రొళ్లలో ఎస్సీ (గ్రూప్–3)–2, ఓసీ–1 ఖాళీలున్నాయి. అలాగే 7వ తరగతిలో మలుగూరులో ఎస్సీ (గ్రూప్–3)–1, ఎస్టీ–1, అమరాపురంలో ఎస్సీ (గ్రూప్–3)–1, హిందూపురం బాలకల పాఠశాలలో ఎస్సీ (గ్రూప్–3)–3, ఎస్టీ–1, బీసీ–1, రొళ్ల పాఠశాలలో ఎస్టీ–1 ఖాళీలున్నాయి. 9వ తరగతిలో హిందూ పురం బాలికల పాఠశాలలో ఎస్సీ (గ్రూప్–3)–1 ఖాళీ ఉందని జయలక్ష్మీ వెల్లడించారు.

ఆర్డీటీ పరిరక్షణకు ఎందాకైనా పోరాడతాం

- అడ్డంకులు సృష్టించినా.. రంగయ్య పాదయాత్ర పూర్తి చేశారు
- కూటమి నేతలు వెంటనే ప్రధాని మోదీని కలవాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి

కళ్యాణదుర్గం: కులమత భేదాలు చూపకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని వర్గాలనూ ఆదుకున్న ఆర్డీటీ పరిరక్షణకు ఎందాకైనా పోరాడ తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డీటీకి నష్టం కలిగిస్తున్నాయని విమర్శించారు. మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు డాక్టర్ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర 16 రోజులు కొనసాగి గురువారం ముగిసింది. ఈ సందర్భం గా కళ్యాణదుర్గం బళ్లారి మిట్టపై ఏర్పాటు చేసిన బహిరంగ సభలో 'అనంత' మాట్లాడారు. ఆర్డీటీని కాపాడుకునేందుకు దశల వారీ ఉద్యమా లకు శ్రీకారం చుట్టామని, అందులో భాగమే రంగయ్య పాదయాత్ర అన్నారు. రంగయ్య పాదయాత్ర చేయడం ఎంతో గొప్ప విషయ మన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల మద్దతుతో పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. పాదయాత్ర చేస్తే కాళ్లకు నొప్పులు...బొబ్బలు వస్తాయని టీడీపీ నేతలు వ్యంగంగా మాట్లాడారని దుయ్య బట్టారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ కోసం ఇప్పటికే బైకు ర్యాలీ చేశామన్నారు. ఇంత చేస్తున్నా ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లైనా లేద న్నారు. బడుగు, బలహీన వర్గాలే వైఎస్సార్‌సీపీకి వెన్నెముక అన్నారు. ఆర్డీటీకి నష్టం కలిగించేం దుకు బీజేపీ, కూటమి ప్రభుత్వం మతం రంగు పూసిందని మండి పడ్డారు. ఆర్డీటీపై ప్రజల అభి ప్రాయాలను కేంద్రానికి పంపాలని సూచిం చారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ కోసం జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ముగ్గురు మంత్రులు వెంటనే పీఎం మోదీ, కేంద్రం హోం మంత్రిని కలవాలన్నారు. రాయలసీమలో అత్యంత వెనుకబడిన అనంత పురం జిల్లాను అభివృద్ధి చేసేందుకు 55 ఏళ్ల నుంచి ఆర్డీటీ కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం ఆర్డీటీ మనుగడకే ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.



కళ్యాణదుర్గం పట్టణంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



రంగయ్యకు సంఘీభావం తెలిపి కలిసి నడుస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మహాలక్ష్మి శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం

ఈ ప్రాంత ప్రజల కోసమే..

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పార్లమెంట్ అబ్జ ర్వర్ నరేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆర్డీటీ కోసం రెండోసారి పోరాటం చేపట్టామన్నారు. ఈ ప్రాంత ప్రజల బాగు కోసం రంగయ్య పాదయాత్ర చేసినట్లు తెలిపారు. పాదయాత్రకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించా రని, వారు తుపాకులతో అడ్డుకున్నా రంగయ్య జంకలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, పార్టీ పీఏసీ సభ్యులు మహా లక్ష్మి శ్రీనివాస్, మడకశిర వైఎస్సార్ సీపీ సమన్వ యకర్త ఈరలక్కప్ప, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం నగరపాలక డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా ఉద్యమం..

పార్టీ ఆశీస్సులు, ప్రజా మద్దతుతో విజయ వంతంగా పాదయాత్ర పూర్తి చేశా. నాది రాజకీయ ఉద్యమం కాదు.. గొప్ప ప్రజా ఉద్యమం. ఆర్డీటీ ఆసుపత్రులు మూతపడితే పేద ప్రజలకు జరిగే నష్టాన్ని గుర్తెరిగి మంచి కోసం అందరూ పాటుపడాల్సిన అవసరం ఉంది.

– తలారి రంగయ్య, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు

క్లుప్తంగా

అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అనంతపురం, గుంతకల్లు, గుత్తి మీదుగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హుబ్లీ–బనారస్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 07323, 07324) జూలై 5 నుంచి 29వ తేదీ వరకు ప్రతి శని, మంగళ వారాల్లో జిల్లా మీదుగా నడుస్తాయన్నారు. అలాగే యశ్వంత్‌పూర్– గయా మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 06563, 06564)) జూలై 5 నుంచి 28వ తేదీ వరకు ప్రతి శని, సోమవారాల్లో రాకపోకలు సాగిస్తాయన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య


మహబుబ్‌బాషా (ఫైల్)

తాడిపత్రి రూరల్: ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన మహబుబ్‌బాషా (25) ఐటీఐ చేశాడు. ఈ క్రమంలో కొంత కాలం రైల్వేలో అప్రెంటిస్ చేశాడు. ఆ తర్వాత ఉద్యోగం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తాడిపత్రిలోనే వాహనాల సీట్ కవర్లు కుట్టు షాపులో పనిలోకి చేరి కొంత కాలం తర్వాత సొంతంగా దుకాణం పెట్టాలని అనుకున్నాడు. అయితే దుకాణం ఏర్పాటుకు అప్పు చేయాల్సి రావడంతో వ్యాపారం సరిగా జరగకపోతే నష్టపోవాల్సి వస్తుందని భయపడి మరోసారి ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. అయినా ఉద్యోగ అవకాశాలు దక్కకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని గురువారం పుట్లూరు మార్గంలోని రైల్వే గేట్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

అనంతపురం అర్బన్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో రెవెన్యూ డే నిర్వహించనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు హాజరు కానున్నారు.

నత్తే నయం...

- సాగుతున్న పీఏబీఆర్, ఎంపీఆర్ రెగ్యులేటర్ల నిర్మాణ పనులు
- రూ.8 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన పనులు

ఉరవకొండ: మండలంలోని మోపిడి వద్ద హెచ్చెల్సీ ప్రధాన కాలువపై 189.25వ కిలోమీటరు లింక్ చానల్ వద్ద ఉన్న పీఏబీఆర్, ఎంపీఆర్ రెగ్యులేటర్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.8 కోట్ల అంచనా వ్యయంతో ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం పనులు ప్రారంభమయ్యాయి. మరో నెల రోజుల్లో తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల కానున్న నేపథ్యంలో పనుల పూర్తిపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ హయాంలో నిధుల మంజూరు

పూర్తిగా శిథిలావస్థకు చేరిన మోపిడి సమీపంలోని హెచ్చెల్సీ లింక్ చానల్ వద్ద పీఏబీఆర్ హెడ్ రెగ్యులేటర్ 2020, ఆగస్టు మొదటి వారంలో కుప్పకూలింది. దీంతో ఇసుక మూటలు అడ్డుపెట్టి పీఏబీఆర్‌కు నీటిని మళ్లించే ప్రక్రియను చేపట్టారు. రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.3.3 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపి నిధులు కేటాయించింది. అయితే అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో నిధులు ఆగిపోయాయి. తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వం పీఏబీఆర్‌తో పాటు ఎంపీఆర్‌కు నూతన రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి చెరో రూ.4 కోట్లు చొప్పున మొత్తం రూ.8 కోట్ల నిధులను విడుదల చేసింది.

పనులు పూర్తి కాకపోతే నీటి విడుదల ఎలా?

పనులు పూర్తి చేయించడంలో అంతులేని ఉదాసీనత చోటు చేసుకుంది. పీఏబీఆర్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు ఇంకా భూమి చదును చేసే దశలోనే ఉన్నాయి. ఎంపీఆర్ రెగ్యులేటర్ పనులు కొంత మేర జరుగుతున్నాయి. కాగా, జూలై రెండో వారంలో తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీరు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ లోపు పనులు పూర్తి కావాలి. లేకపోతే నీటి విడుదల జరిగితే కాలువకు గండ్లు పడే ప్రమాదముందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నత్తనడకన సాగుతున్న ఎంపీఆర్ రెగ్యులేటర్ పనులు


మోపిడి సమీపంలో భూమి చదునుకే పరిమితమైన దృశ్యం

పనులు పూర్తి చేసేలా చర్యలు

పీఏబీఆర్, ఎంపీఆర్ హెడ్ రెగ్యులేటర్ పనులు వేగవంతం చేస్తాం. భారీ వర్షాలతో పాటు హెచ్చెల్సీలో నీరు చేరి పనులకు అడ్డంకిగా మారాయి. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం.

– దివాకర్‌రెడ్డి, హెచ్చెల్సీ, డీఈ

అసంబద్ధ జీఓలతో అన్యాయం చేశారు


మాట్లాడుతున్న సిరాజుద్దీన్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయని, తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన గురువారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ అత్యవసర సమావేశంలో ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ మాట్లాడారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో చోటు చేసుకున్న తప్పిదాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రీవెన్స్‌లో ప్రయారిటీ ఇచ్చిన వాటిని సంపూర్ణంగా సవరించకుండానే బదిలీలు పూర్తి చేశారన్నారు. ఫలితంగా వందలాది మంది ఉపాధ్యాయులు భారీగా నష్టపోయారన్నారు. రోజుకు, గంటలకు మారుస్తూ విద్యాశాఖ జారీ చేసిన అసంబద్ధ జీఓలు తీవ్ర గందరగోళానికి తెరలేపాయన్నారు. ఈ క్రమంలో చేసిన చోటు చేసుకున్న తప్పిదాల కారణంగా అర్హత ఉన్న వారు సైతం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. తక్షణమే వీటిని సవరించి నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పాఠశాలల్లో జీతాలు తీసుకోవడానికి వీలు లేకుండా అక్కడ పోస్టింగ్ చేశారని, వారందరికీ 1వ తేదీన జీతాలు చెల్లించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా నెలకొన్న జూనియర్, సీనియర్ వివాదానికి తెరదించేలా స్పష్టమైన ఆదేశాల ద్వారా పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ బీవీ రమణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.వన్నప్ప, నాయకులు అడవిరాజు, యల్లప్ప, చిదంబరయ్య, తిప్పేస్వామి, నజీర్, హనుమంతు, సలీం, మన్సూర్, అలీ, యాకూబ్, కరుణాకర్ పాల్గొన్నారు.

బాబుది ధృతరాష్ట్రుడి పాలన

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు


నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కులసంఘాల ప్రతినిధులు

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ధృతరాష్ట్రుడి పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు మండిపడ్డారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ, కుల సంఘాల ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెన్నోబులేసు మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ఫలితంగా మహిళలు, బాలికలు, చిన్నారులపై దాడులు, అత్యాచారాలు హత్యలు పెరిగి పోయాయన్నారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలో ఓ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ విద్యార్థినిపై 18 మంది సామూహికంగా అత్యాచారం చేసి గర్భవతిని చేసినా నిందితులను అరెస్ట్‌లో ఉదాసీనత వ్యవహరిస్తుండడం దుర్మార్గమన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతుంటూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అడ్డు పెట్టుకుని ఆంక్షలు విధిస్తున్నారని మండిపడ్డారు. పోనీ బాధిత కుటుంబాన్ని ఉమ్మడి జిల్లాలోని దళిత ఎమ్మెల్యేలు కనీసంగానూ పరామర్శించలేదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా వెనుకాడబోమని, ఆ గ్రామాన్ని సందర్శించి బాధితులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు సాగిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు వడియంపేట మంత్రి ఆంజనేయులు, సాకే శివశంకర్, సీపీ ఓబులేసు, సాకే ఆనంద్, వజ్రం గంగరాజు, వెంకటేశులు, నాగరాజు, విష్ణు నారాయణ, బండారు నగేష్, మారుతి, సాకే అంజి, మల్లేష్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనకు పటిష్ట చర్యలు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుంతకల్లు: ఉమ్మడి జిల్లాలో నాటు సారా నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య స్పష్టం చేశారు. గుంతకల్లులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం అనంతపురం, కర్నూలు జిల్లా సరిహద్దులో నాటు నారా నిర్మూలనకు చేపట్టాల్సిన కార్యాచరణపై కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ హనుమంతురావు, ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్, సీఐ శివసాగర్, అనంతపురం స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్లు జయనాథరెడ్డి, సుహాసిని, కర్నూలు స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ జయరామ్‌నాయుడుతో కలిసి చర్చించారు. నాటు సారా తయారీ కేంద్రాలపై తరుచూ సంయుక్త దాడులు నిర్వహించాలని తీర్మానించారు. బైండోవర్ కేసుల్లోని వ్యక్తులపై నిఘా మరింత పెంచాలని నిర్ణయించారు.

అర్హులందరికీ విత్తన వేరుశనగ

కూడేరు: జిల్లా వ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి రైతుకూ సబ్సిడీ విత్తన వేరుశనగను అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. కూడేరు, గొటుకూరులోని రైతు సేవాకేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సబ్సిడీ విత్తన కాయల రిజిస్ట్రేషన్ వివరాలను ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండల వ్యాప్తంగా 1,350 మంది రైతులు 1,210 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఏఓ శుభకర్ వివరించారు. త్వరలో సబ్సిడీతో కందులు కూడా పంపిణీ చేస్తామని, ఈ విషయంపై రైతులను చైతన్య పరచాలని సూచించారు. అనంతరం స్థానిక స్వశక్తి రైతు సంఘం కేంద్రంలో రైతులకు సబ్సిడీతో పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న వేరుశనగ విత్తన కాయల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ రాకేష్ నాయక్, ఏఈఓ రాఘవేంద్ర రైతు సేవాకేంద్రాల సిబ్బంది రాజ్‌కుమార్, సాజియా తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్: స్థానిక ఆలూరు మార్గంలోని ఎస్‌ఎస్ ట్యాంక్ ఆర్చ్ వద్ద నివాసముంటున్న వీఆర్‌ఏ రామాంజనేయులు ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో వీఆర్‌ఏగా రామాంజనేయులు పనిచేస్తున్నారు. ఆయన భార్య సులోచనమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 9న మృతి చెందారు. దీంతో పుణ్యక్షేత్రంలో నిద్ర చేయాలని పెద్దలు సూచించడంతో ఈ నెల 16న ఇంటికి తాళం కుటుంబసభ్యులతో కలసి ఆరోగ్యమాత క్షేత్రానికి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున ఇంటి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళం బద్ధలుగొట్టి బీరువాలోని 5 తులాల బంగారు నగలు అపహరించినట్లుగా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయం


లోకోమోటివ్ షెడ్ సాధించిన అవార్డులను విడుదల చేసిన రైల్వే జీఎం, డీఆర్‌ఎంలు

గుంతకల్లు: ప్రయాణికులు, ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. డివిజన్ పర్యటనలో భాగంగా గురువారం గుంతకల్లుకు వచ్చిన ఆయన డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తాతో కలిసి హెడ్‌క్వాటర్స్‌లోని లోకోమోటివ్ షెడ్‌లో రూ.కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత 115 కేఎంపీ ఆన్ గ్రిడ్ సోలార్ ప్లాంట్‌తో పాటు అనుబంధ సేవా భవనంలో ఏర్పాటు చేసిన మీటింగ్ హాల్, టూల్ రూమ్, మహిళ ఉద్యోగుల విశ్రాంతి గదిని ప్రారంభించారు. లోకోమోటివ్ ఉద్యోగుల కోసం టూల్ రూమ్‌లో ఉంచిన పరికరాలను పరిశీలించి, వాటి ప్రాముఖ్యతను సీనియర్ డీఎంఈ మంగచార్యులను అడిగి తెలుసుకున్నారు.

షెడ్ ఉద్యోగులకు అభినందన

విద్యుత్ లోకో మెయింటెనెన్స్, విద్యుత్ ఆదా, పరిసరాల పరిశుభ్రత, ఉద్యోగుల భద్రత తదితర విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన లోకోమోటివ్ షెడ్ ఉద్యోగులు క్యూఆర్‌ఓ, ఓటాబు సంస్థ నుంచి అవార్డులను సొంతం చేసుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జీఎం... షెడ్ విభాగం ఉద్యోగులను అభినందించారు. రూ.25 వేల నగదు రివార్డును ప్రకటించారు. రైల్వే అభివృద్ధికి ప్రతి ఉద్యోగీ తన వంతు సహకారం అందించాలన్నారు. తద్వారా ప్రయాణికులకు మెరుగైన ప్రయాణం అందించడానికి వీలుంటుదన్నారు. అంతకు ముందు లోకోమోటివ్ షెడ్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో డివిజన్ స్థాయి అధికారులతో సమావేశమై మాట్లాడారు. డివిజన్ పగ్రతి, అభివృద్ధి పనులు తదితరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, డీఈఈ నాగేశ్వరరావు, ఏడీఎంఈ కేవీ నరేష్‌కుమార్‌తో పాటు జోనల్, డివిజన్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

రీ–సర్వే గ్రామాల్లో ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్

అనంతపురం అర్బన్: భూముల రీ–సర్వే జరిగిన గ్రామాల్లో ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడంలో నెలకొన్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టామన్నారు. రెవెన్యూ శాఖ సబ్ డివిజన్ సేవ కోసం నిర్ధారించిన రూ.500 రుసుంకు మినహాయింపు ఇచ్చారన్నారు. నామమాత్రంగా దరఖాస్తు రుసుం రూ.50ను సంబంధిత గ్రామ సచివాలయంలో చెల్లిస్తే జాయింట్ పట్టాదారుల భూములను ఉచితంగా సబ్ డివిజన్ చేస్తారన్నారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకునే వారికే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కేంద్ర జల సంఘం సభ్యుల పర్యటన


అటవీ ప్రాంతంలో పనులను పరిశీలిస్తున్న కేంద్ర జల సంఘం సభ్యులు

రాయదుర్గం టౌన్: మండలంలోని టి.వీరాపురం గ్రామంతో పాటు వివిధ ప్రాంతాల్లో కేంద్ర జల సంఘం బృందం సభ్యులు గురువారం పర్యటించారు. 6వ కేంద్ర జల అవార్డుకు జిల్లా ఎంపికైన నేపథ్యంలో వారి పర్యటన కొనసాగింది. కేంద్ర జల సంఘం డిప్యూటీ డైరక్టర్ కె.శంకర్, శాస్త్రవేత్త ఎంఎస్ గౌతమ్ నేతృత్వంలోని సభ్యుల బృందం టి.వీరాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో కందకాలు, మొక్కల పెంపకాన్ని ఫారెస్ట్ అధికారులతో కలిసి పరిశీలించారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా టి.వీరాపురం వద్ద ఏర్పాటు వద్ద నీటి చెరువు, వాటర్ షెడ్ పనుల్లో నాణ్యతను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీ అసిస్టెంట్ దేవరాజ్, ఏపీఓ రవి, ఎఫ్ఆర్‌ఓ రామచంద్రుడు, డీఆర్‌ఓ దామోదర్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధినేతతో భేటీ


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన శింగనమల నియోజకవర్గ నాయకులు

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ ఎన్ఆర్ఐ వింగ్ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్, ఆయన తనయుడు సాకే రుత్విక్ కలిశారు. వీరితో పాటు నియోజకవర్గ నాయకులూ ఉన్నారు.

గని కార్మికుడిపై యాజమాన్యం దాడి

యాడికి: గనిలో పనికి వెళ్లకపోవడంతో కార్మికుడిపై యజమానులు దాడి చేశారు. బాధిత కార్మికుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన గని యజమానులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు... యాడికి మండలం చందన గ్రామానికి చెందిన హుస్సేన్.. గ్రామ సమీపంలోని బాబుగౌడ్ గనిలో పదేళ్లుగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబపోషణకు అవసరమై కొంత డబ్బును యజమానులతో అప్పుగా తీసుకున్నాడు. ఈ మొత్తాని గని యజమాని బాబుగౌడ్‌కు చెల్లించి, వారం క్రితం వేరే పనులకు హాజరయ్యేవాడు. ఇది గమనించిన బాబుగౌడ్ కుమారుడు గణేష్ రెండు రోజుల క్రితం వేరే పనులకు పోతున్న హుస్సేన్‌ను అడ్డుకుని గనిలో పనికే రావాలని గొడవపడి దాడి చేశాడు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం గని యజమానులిద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా షారోన్ సోనియా

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఆత్మారాం



అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ షారోన్ సోనియా, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆత్మారాం నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వ ప్రిన్సిపాల్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావులను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలోనే ఆయా స్థానాల్లో షారోన్ సోనియా, డాక్టర్ ఆత్మారాంను నియమించారు.

నెత్తురోడిన రహదారులు

జిల్లాలో గురువారం రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఆరు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతి వేగమే ప్రమాదాలకు కారణంగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి దుర్మరణం


మృతుడు పార్థసారథి)

శెట్టూరు: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మరో బైక్‌పై వెళుతున్న బ్యాంక్ ఉద్యోగి దుర్మరణం పాలయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన పార్థసారథి (53) శెట్టూరు మండలం ములకలేడులోని యూనియన్ బ్యాంక్ శాఖలో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. కళ్యాణదుర్గంలో నివాసముంటూ రోజూ ద్విచక్రవాహనంపై విధులకు వెళ్లి వచ్చేవారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు కళ్యాణదుర్గం నుంచి తన ద్విచక్రవాహనంలో ములకలేడుకు బయలుదేరారు. శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి – యాటకట్లు గ్రామాల మధ్య ప్రయాణిస్తుండగా మలుపులో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన కనుకూరు గ్రామానికి చెందిన సత్యప్ప ఢీకొన్నాడు. ఘటనలో రోడ్డుపై పడిన పార్థసారథి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సత్యప్పతో పాటు ఆయన కుమార్తెకూ తీవ్ర గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళుతున్న వారు గుర్తించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పార్థసారథి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి...

ఉరవకొండ: స్థానిక అనంతపురానికి వెళ్లే మార్గంలోని 42వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో పడి ఉన్న మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని దూసుళ్లడంతో తల ఛిద్రమై పోయింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. మృతుడికి దాదాపు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుంది. బ్లూకలర్ ఫుల్ షర్ట్, బ్లూకలర్ గీతల ప్యాంటు, లెదర్ చెప్పులు ధరించాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ జనార్దననాయుడు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94407 40876కు సమాచారం అందించాలని కోరారు.

ఆటో బోల్తా పడి..

కూడేరు: మండలంలోని ఎస్సీసీ నగర్ సమీపంలో ఆటో బోల్తాపడిన ఘటనలో అనంతపురంలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన దూదేకుల షెక్షావలి (28) మృతి చెందాడు. మరో ఇద్దరు వ్యక్తులతో కలసి గురువారం ఉదయం ఉరవకొండ నుంచి అనంతపురానికి ఆటోలో షెక్షావలి బయలుదేరాడు. ఎస్సీసీ నగర్ సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉంచిన సిమెంట్ స్తంభాలపైకి ఎక్కి బోల్తాపడింది. ఘటనలో షెక్షావలి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కూడేరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బైక్ పైనుంచి పడి మహిళ...

బొమ్మనహాళ్: కుమారుడితో కలసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళ అదుపు తప్పి కిందపడి మృతి చెందింది. వివరాలు... మండలంలోని లింగదహాళ్ గ్రామానికి చెందిన నీలమ్మ (55) గురువారం ఉదయం తన కుమారుడు విరూపాక్షితో కలసి ద్విచక్ర వాహనంపై ఉద్దేహాళ్ గ్రామంలోని ఏపీజీబీ బ్యాంక్‌కు బయలుదేరారు. లింగదహాళ్ గ్రామం దాటగానే నీలమ్మ చీర ద్విచక్ర వాహనం వెనుక చక్రానికి చుట్టుకోవడంతో అదుపు తప్పి కిందపడింది. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త కోవిడ్–1లో మృతి చెందాడు. ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని..

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన ఖాసీం (52) తన స్నేహితుడు హరిజన పెద్దయ్యతో కలసి ద్విచక్ర వాహనంపై గురువారం గుత్తికి వచ్చాడు. గుత్తి ఆర్ఎస్‌లోకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న ఖాసీం ఎగిరి రోడ్డుపై పడడంతో అతని తల మీదుగా లారీ చక్కాలు దూసుకెళ్లి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

బైక్‌లు ఢీకొని..

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామ శివారులో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. జక్కలవడికి గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు (55) ద్విచక్ర వాహనంపై వెళుతూ గ్రామ శివారులోకి చేరుకోగానే ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకొచ్చిన లోకేష్‌రెడ్డి ఢీకొన్నాడు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ స్థానికులు బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. తలకు తీవ్ర గాయమై పరిస్థితి విషమంగా ఉన్న ఆంజనేయులను బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సోలార్ కోల్డ్‌రూం పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో మహబూబ్‌బాషా అనే ట్రేడర్ నిర్మించిన కోల్డ్‌రూంను హెచ్‌ఓ రత్న కుమార్, హెచ్ఈఓ రామాంజనేయులుతో కలిసి ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.ఉమాదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతేడాది మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) పథకం కింద 35 శాతం రాయితీతో కోల్డ్‌రూం మంజూరు చేశామన్నారు. నిబంధనల మేరకు అన్ని వసతులతో నిర్మాణం జరిగినట్లు తెలిపారు. 10 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్‌రూం మొత్తం ఖర్చు రూ.12.50 లక్షలు కాగా.. అందులో ఉద్యానశాఖ ద్వారా రూ.4,37,500 రాయితీ వర్తింపజేశామని వెల్లడించారు. యాపిల్, కివీ, అవకాడో తదితర అన్ని రకాల పండ్లు, ఆక్వా ఉత్పత్తులు, పాలు లాంటివి నిల్వ చేసుకునేందుకు ఇలాంటి కోల్డ్‌రూంలు చాలా ఉపయోగపడుతాయన్నారు.

22న సేవ్ ఆర్డీటీ ర్యాలీ



సమావేశమైన జిల్లా క్రికెట్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: సేవ్ ఆర్డీటీ కార్యాక్రమానికి మద్దతుగా ఈనెల 22న నగరంలో చేపట్టిన భారీ ర్యాలీని జయప్రదం చేయాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. 22న ఉదయం 9 గంటలకు టవర్‌క్లాక్ నుంచి ర్యాలీ ప్రారంభమై సుభాష్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ సాగుతుందన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, క్రీడా రంగాల్లో ఆర్డీటీ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేసిందని కొనియాడారు. కష్టకాలంలో ప్రతి ఒక్కరూ ఆర్డీటీకీ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మచ్చా రామలింగారెడ్డి, భీమలింగారెడ్డి, షాబుద్దీన్, యుగంధర్‌రెడ్డి, సురేష్, రవీంద్రనాథ్‌రావు, కమలాకర్ నాయుడు, సీతారామరావు, శ్రీధర్, మహేష్, మురళీపాల్గొన్నారు.

పాడి ఆవు కంటికి ఆపరేషన్

అనంతపురం అగ్రికల్చర్: క్యాన్సర్ వ్యాధి ముదిరిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న పాడి ఆవుకు పశుసంవర్ధకశాఖ శింగనమల ఏడీ డాక్టర్ జి.పద్మనాభం బృందం ఆపరేషన్ చేసి బతికించారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులో లక్ష్మమ్మకు చెందిన రోజుకు 20 లీటర్ల వరకు పాలు ఇచ్చేది. పాడి ఆవు కంటికి క్యాన్సర్ సోకడంతో రోజురోజుకు బలహీనమై ఆరోగ్యం క్షీణించడంతో లక్ష్మమ్మ పశుశాఖ ఏడీ పద్మనాభంను సంప్రదించింది. పాడి ఆవును స్థానిక సాయినగర్ పశువైద్యశాలకు తరలించి పరీక్షించారు. కుడి కన్నుకు పురుగులు పట్టి దుర్గంధంతో ఛిద్రమైన విషయాన్ని గమనించారు. కన్ను తొలగించడానికి లక్ష్మమ్మ అంగీకరించడంతో డాక్టర్ పద్మనాభం బృందం వెంటనే శస్త్రచికిత్స చేసి కన్నుతో పాటు లోపల ఉన్న క్యాన్సర్ గడ్డను తొలగించారు. అనంతరం ఆవుకు అవసరమైన ఫ్లూయిడ్స్, యాంటీబయాటిక్స్, అనాలజిసిక్స్, యాంటీ సిస్టమేన్స్ ఇచ్చారు. శస్త్రచికిత్స చేసి పాడి ఆవును బతికించిన డాక్టర్ పద్మనాభం, మొబైల్ అంబులెన్స్ డాక్టర్ సునీత, పశుశాఖ అసిస్టెంట్స్ శివ, జమ్మన్న, జగదీష్ తదితరులకు లక్ష్మమ్మ ధన్యవాదాలు తెలిపింది.

మెరుగైన సేవలందించండి



ట్యాబ్‌లను అందిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని నూతన భవనంలో పట్టణ, స్లమ్ సమైక్య రీసోర్స్ పర్సన్లకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంలో భాగంగా బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి, కేంద్ర ప్రభుత్వ పథకాలు తదితర వాటిని ఆన్‌లైన్ చేయడానికి ట్యాబ్‌లు దోహదపడుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పేదలకు మరింత మెరుగైన సేవలందించాలని తెలిపారు. కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ.. మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలన్నారు. పేద మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు మెప్మా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ విశ్వజ్యోతి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ భవాని, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

పుస్తకాల విక్రయాలను అడ్డుకున్న విద్యార్థి నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని సంసిద్ పాఠశాలలో పుస్తకాల విక్రయిస్తుండటంతో గురువారం విద్యార్థి సంఘాల నాయకులు వెళ్లి అడ్డుకున్నారు. పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నారన్నారు. ఆందోళన చేసి విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. పాఠశాలకు చేరుకున్న విద్యాశాఖ అధికారులు పుస్తకాల విక్రయిస్తున్న గదిని సీజ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ ఓబులేసు, పీఎస్ఎఫ్ అబ్దుల్ అలం, వీఎస్ఐవీ రామన్న, ఏఐఎస్‌పీ నరసింహ, పీఎస్ఎఫ్ ప్రతిభ పాల్గొన్నారు.

బతుకు చిత్రం



ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను ఏరుకుని వస్తున్న దృశ్యం

పొట్టకూటి కోసం మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఎలాంటి ఆదరణ లేని అభాగ్యులు ఎందరో ఉదయం లేవగానే కుటుంబ పోషణ కోసం నగరమంతా కలియదిరిగి రాత్రికి గాని ఇంటికి చేరుకునే పరిస్థితి ఉండదు. ఇలా కిలోమీటర్ల కొద్దీ రోజూ తిరిగి తిరిగి ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు సేకరించి గుజరీకి అమ్మేసి కడుపునింపుకుంటున్నారు. గురువారం టీవీ టవర్ సమీపంలో ఇద్దరు మహిళలు ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఏరుకుంటున్న దృశ్యం కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



ఎండలో చిన్నారిని ఎత్తుకుని బైక్‌లో కూర్చున్న మహిళ

బాల్య వివాహాలతో అనర్థాలు



వాల్ పోస్టర్లను చూపుతున్న ఆరోగ్య సిబ్బంది

ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా పాఠశాలలో గురువారం మండల వైద్యాధికారి సబిహా సుల్తానా ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాల వయస్సు వచ్చాక వివాహాలు చేయాలన్నారు. బాల్యంలోనే పెళ్లిళ్లు చేయడం వల్ల శారీరక, మానసిక ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. బాల్య వివాహాల వల్ల పిల్లల చదువుతో పాటు వారి భవిష్యత్ కూడా అంధకారంగా మారుతుందని పేర్కొన్నారు. టీనేజ్‌లోనే ప్రెగ్నెన్సీ వల్ల తల్లీబిడ్డ అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. బలవంతపు బాల్య వివాహాలకు పాల్పడితే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే లింగ వివక్ష నిర్మూలనపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీమారోజ్, సూపర్‌వైజర్ మధుబాబు పాల్గొన్నారు.

ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఓవరాక్షన్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా ఓవరాక్షన్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరా జాప్యం జరిగిదంటూ కింది స్థాయి సిబ్బందికి మహబూబ్ బాషా ఫోన్ చేశారు. 9వ డివిజన్ కార్పొరేటర్ దేవి తండ్రి అయిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాధర్‌ను ఫోన్‌లో తక్కువ చేసి మాట్లాడారు. సీపీఐ జాఫర్, వైఎస్సార్‌సీపీ నేత గంగాధర్ ఉండే ప్రాంతాలైన నీరుగంటి వీధి, రాణినగర్, తదితర ప్రాంతాలకు ఇప్పుడు నీరు రాకపోతే ఆగిపోతుందా? అయినా వైఎస్సార్‌సీపీ వాళ్ల పదవీ కాలం అయిపోయిందో ఇక వాళ్లతో మనకేం పని. అంటూ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా వ్యంగంగా మాట్లాడిన మాటలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఉద్యోగులు తమ విధులు నిర్వర్తించకుండా రాజకీయాలు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

అనంతపురం సెంట్రల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. గురువారం డి.హీరేహాళ్ మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఐచర్ వాహనంలో కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. సుమారు 134 క్వింటాళ్లు ఉండటంతో వాహనాన్ని జప్తు చేసి డిప్యూటీ తహసీల్దార్ సురేష్ బాబుకు స్వాధీనం చేశారు. వాహన డ్రైవర్ షఫిక్ అహ్మద్, వాహన యజమాని జావేద్, వ్యాపారి దాదాపీర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ జమాల్ బాషా, ఏఈఈ రవీంద్రనాథ్, సీఎస్‌డీటీ సురేష్ బాబు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి ఫాదర్ ఫెర్రర్

అనంతపురం టవర్‌క్లాక్: పేదల ఆశాజ్యోతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కొనియాడారు. ఫెర్రర్ 16వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవలందించడంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సేవలు మర్చిపోలేమన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో సేవలందిచారని తెలిపారు. కార్యక్రమంలో సుగమంచి శ్రీనివాసులు, గోవర్ధన్, మల్లి, నాగరాజు, రామాంజనేయులు, రామకృష్ణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

అనంతపురం సెంట్రల్: కరువు జిల్లా అనంతలో బడుగుల అభివృద్ధికి ఆర్డీటీ సంస్థను స్థాపించి ఎంతో శ్రమించిన మహనీయుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ కొనియాడారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 1969 నుంచి జిల్లాలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, హెచ్ఐవీ బాధితుల కోసమే కాకుండా జిల్లా అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కుమన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



హుస్సేన్ (ఫైల్)

అనంతపురం రూరల్: ఆగి ఉన్న లారీని బస్సు ఢీ కొట్టిన ఘటనలో రాజీవ్‌కాలనీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హుస్సేన్ (55) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. హుస్సేన్ వ్యక్తి గత పని నిమిత్తం విజయవాడ వెళ్లి తిరిగి అనంతపురానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. గురువారం తెల్లవారుజామున ప్రకాశం జిల్లా కాకాణి లక్ష్మీపురం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొనడంతో బస్సు ముందు భాగంలో కూర్చున్న హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు హుటాహుటిన అతడిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే హుస్సేన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని కటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ పెద్ద దిక్కు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. రెండు పర్యాయాలు రాజీవ్‌కాలనీ పంచాయతీ సర్పంచ్‌గా గెలిచి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పేదలకు అండగా నిలిచిన హుస్సేన్ మృతి చెందాడన్న విషయం తెలియడంతో రాజీవ్‌కాలనీ పంచాయతీలో తీవ్ర విషాదం నెలకొంది. హుస్సేన్‌కు భార్య ఆశాబీ (ప్రస్తుత సర్పంచ్) కుమారుడు, కూమార్తె ఉన్నారు.

రిలీవింగ్, జాయినింగ్ తేదీలపై స్పష్టత ఇవ్వాలి

అనంతపురం ఎడ్యుకేషన్: తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ తేదీలపై స్పష్టత ఇవ్వాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన టీచర్ల బదిలీల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు జూన్ 6న విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం తెలుగు, హిందీ టీచర్లు జూన్ 8వ తేదీన రిలీవ్ అయ్యి.. 9వ తేదీన నూతన పాఠశాలల్లో జాయిన్ కావాలని చెప్పారన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే దాకా రిలీవ్ కావొద్దంటూ అదేరోజు సాయంత్రం మరో ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వీటిని అనుసరించి పాఠశాల సహాయకులు (భాష) ఆరోజు బదిలీ పొందిన పాఠశాలలో చేరకుండా పూర్వపు పాఠశాలలోనే డిప్యుటేషన్ కింద ఫేషియల్ అటెండెన్స్ కూడా వేశారన్నారు. కానీ ఈనెల 15న విడుదల చేసిన ఉత్తర్వుల్లో 14వ తేదీ రిలీవింగ్ 15వ తేదీ జాయినింగ్ అని కొంతమంది, 15వ తేదీ రిలీవింగ్ 16వ తేదీ జాయినింగ్ అని ఉండటంతో సందిగ్ధత నెలకొందన్నారు. ఒక స్పష్టమైన తేదీని జిల్లా వ్యాప్తంగా ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు సూచించాలని కోరారు. అలాగే బదిలీ పొందిన వారికి క్యాడర్ స్ట్రెంత్ ఆమోదం తెలిపి సకాలంలో జీతాలు అందించాలన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రా రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గోవింద రాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రమణయ్య పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కవితా పోటీల విజేతలకు సన్మానం

అనంతపురం కల్చరల్: తెలుగు వెలుగు సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితా పోటీల విజేతలను సత్కరించారు. గురువారం స్థానిక సాయి డిగ్రీ కాలేజ్ ప్రాంగణంలో సంస్థ వ్యవస్థాపకుడు టీవీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జనప్రియ కవి ఏలూరు యంగన్న ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సేవా బాంధవుడు విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా కవితా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు మూడు రాష్ట్రాల వారు ఫెర్రర్ సేవలు తెలుసుకునేలా పోటీలు నిర్వహించారన్నారు. కరువు ప్రాంతాన్ని కాపాడిన మార్గదర్శకుడికి అనంత ఎప్పటికి కృతజ్ఞతగా ఉంటుందన్నారు. అనంతరం ప్రథమ విజేతగా నిలిచిన సారపు గోవిందరాజులు, తృతీయ బహుమతి దక్కించుకున్న పీజీ వెంకటేష్, ప్రత్యేక బహుమతులకు ఎంపికైన గంగాధర్, పెండేకంటి పార్థసారథి తదితరులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రశంసా పత్రాలు, విలువైన పుస్తకాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర రెడ్డి, సామాజిక సేవా కార్యకర్తలు యర్రగుంట్ల కృష్ణారెడ్డి, ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి, కవులు జూటూరు షరీఫ్, సురేష్, మస్తానయ్య, రియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



గోవిందరాజులును సన్మానిస్తున్న నిర్వాహకులు

అతిసారంపై అప్రమత్తత అవసరం

ఆత్మకూరు: అతిసారంపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అతిసారం వ్యాధి నుంచి పిల్లల్ని రక్షించండి అంటూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. పిల్లలకు ఒక రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు పలుచగా విరోచనాలు అయితే అతిసారం ఉన్నట్లు అని తెలిపారు. దీని నివారణకు విటమిన్ 'ఏ' తాపించాలన్నారు. స్వచ్ఛమైన నీరు తాగాలన్నారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. తల్లిపాలు మాత్రమే ఇవ్వడం అనుబంధ ఆహారమని తెలిపారు. రోటా వైరస్, తట్టుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పేర్కొన్నారు. పిల్లలు ఎక్కువగా వాంతి చేసుకున్నా, జ్వరంగా ఉన్నా.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నా వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

యోగాతో మానసిక ప్రశాంతత

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి యోగా శిక్షకుడిగా కాసేపు ఉద్యోగులకు క్లాస్ తీసుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటూనే.. ఆదర్శ నగర్‌లోని స్కేటింగ్ కోర్టులో సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజలకు యోగాలో మెలకువలు నేర్పారు. ప్రాణాయామం, ధ్యానం ఏవిధంగా చేయాలో వివరించారు.



సచివాలయ సిబ్బంది, ప్రజలతో ప్రాణాయామం చేయిస్తున్న కమిషనర్ బాలస్వామి

టీటీడీలో యోగా ముగింపు వేడుకలు

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్తు వారి ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఐదురోజుల పాటూ సాగిన యోగాంధ్ర కార్యక్రమం గురువారం ముగిసింది. యోగా మాస్టర్ రవి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు పాఠశాల విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో టీటీడీ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ బాబు, పండిట్ వేణు పాల్గొన్నారు.

ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయాలి

అనంతపురం సెంట్రల్: కడప జిల్లా వేదికగా జరుగుతున్న రెవల్యూషనరీ స్టూడెంట్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఓబిలేసు యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం ఎస్కేయూలో ఆర్ఎస్ఎఫ్ ప్లీనరీ కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా శ్రీచైతన్య, నారాయణ తదితర ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు, డొనేషన్లు, పుస్తకాలు, యూనిఫామ్స్ అంటూ రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఆర్ఎస్ఎఫ్ పోరుబాట పట్టిందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, మండ్ల రమేష్, విజయ్, తిరుపతయ్య, ఓబిలేసు, శివ, వీర, సురేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రహసన 'యోగ'ం

- కూటమి ప్రభుత్వానికి పబ్లిసిటీ పిచ్చి
- నిరుపయోగంగా మారిన 'యోగాంధ్ర'
- విశాఖపట్నానికి జనసమీకరణ చేయడానికి నానా పాట్లు

సందర్భం :-

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

అనంతపురం కల్చరల్: యోగా, ధ్యానం అంటే ఎంతో గంభీరమైన ప్రక్రియలు. మానసిక ప్రశాంతత కోసం ఇన్నేళ్లు ప్రభుత్వాలు యోగా దినోత్సవాలను నిర్వహించాయి. అయితే ఈసారి గతానికి భిన్నంగా కేవలం పబ్లిసిటీ పరాకాష్టకు చేరేలా కూటమి ప్రభుత్వం నెల రోజుల పాటూ యోగాను ప్రహసనంగా నిర్వహించింది. కేవలం ప్రపంచ రికార్డులంటూ ప్రచారార్భాటంగా యోగాను ఉరుకులు పరుగులు పెట్టించేశారు. అన్ని శాఖల సమన్వయంతో సాగాల్సిన కార్యక్రమాలను వేటికవే గందరగోళంగా చేసేశారు. నెల రోజుల్లో ఎవరు ఏమి నేర్చుకున్నారో తమకే తెలియదని బహిరంగంగానే చెప్పుకోవడం దీనికి ఊతమిస్తోంది. ఏదో వచ్చామంటే వచ్చామన్నంటూ యోగా కార్యక్రమం ఇన్ని రోజులు సాగిపోయింది. మరో ఆశ్చర్యమైన విషయం ఏమంటే.. ఏదో నేర్పించినట్లు వారంతా నేర్చుకుని నిష్ణాతులైనట్లు పాల్గొన్న, పాల్గొనక పోయినా కేవలం పేరు నమోదు చేసుకున్న వారందరికీ ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు పంపడం వింతగా ఉందని జనం పెదవి విరుస్తున్నారు.

దుబారా ఖర్చు..

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పబ్లిసిటీ పిచ్చితో సాగే దారుణాలను ప్రజలు మరోసారి యోగా కోసం చేస్తున్న జనసమీకరణ విషయంలో గుర్తు చేసుకుంటున్నారు. గతంలో పుష్కరాల సమయంలో, తిరుమల వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు, సింహాచలం అప్పన్న చందనోత్సవం వేడుకల్లో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చూశాం. ప్రపంచ రికార్డు కోసమని ప్రభుత్వ పెద్దలు విశాఖపట్నం వెళ్లేందుకు భారీ జనసమీకరణ చేయడానికి నానా పాట్లు పడుతున్నారు. ఇప్పటికే జిల్లా నుంచి 280కి పైగా వాహనాలు వెళ్తున్నట్లు సమాచారం. దీనికి తోడు సందట్లో సడేమియాలాగా సాగుతున్న దుబారా ఖర్చులతో నెల రోజుల పాటూ సాగిన యోగా విన్యాసాలు కేవలం మైదానాలకు పరిమితమై నిరుప'యోగం'గా మారిపోయాయని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కేవలం రికార్డుల కోసం సాగుతున్న ప్రహసన యోగంలో అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం ఎలాగో బాధ్యత వహించదు.. ఎవరికి వారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

24న ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం సెంట్రల్: నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడి, సీజ్ చేయబడిన 23 ద్విచక్ర వాహనాలను ఈనెల 24వ తేదీన వేలం వేస్తున్నట్లు సీఐ జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఆర్డీటీకి అండగా నిలుద్దాం

కనగానపల్లి: పేదల అభివృద్ధి కోసం పని చేసిన ఆర్డీటీ సంస్థకు అందరూ అండగా నిలుద్దామని దళిత సంఘం నాయకుడు ముక్తాపురం మూర్తి తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో గురువారం సేవ్ ఆర్డీటీ పేరుతో దళిత సంఘాల నాయకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ మార్కెట్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు యువకులు, మహిళలతో కలసి ర్యాలీ చేపట్టారు. సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేసి ఆర్డీటీ సంస్థ కొనసాగేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

అనంతపురం సెంట్రల్: నగరంలో మొదటి రోడ్డులో నివాసముంటున్న జాన్ కృపానంద్ అనే మట్కా నిర్వాహకుడిని అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. అతడి నుంచి రూ.12,120 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నగరంలో ఎవరైనా మట్కా, ఇతరత్రా జూదాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం సెంట్రల్: నగరంలో హౌసింగ్ బోర్డు కాలనీలో వ్యభిచార గృహంపై టూటౌన్ సీఐ శ్రీకాంత్, సిబ్బంది దాడి చేశారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న లక్ష్మి అనే మహిళను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఒక భాధితురాలిని రక్షించినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో ఎక్కడైనా ఇలాంటి వ్యభిచార గృహాలు ఉంటే పోలీసులకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తెలిపారు.

వివాహిత హత్య కేసులో భర్త అరెస్ట్

రాప్తాడు: వివాహిత హత్య కేసులో భర్తను అరెస్ట్ చేసినట్లు రాప్తాడు పోలీసులు తెలిపారు. వివరాలను గురువారం వెల్లడించారు. అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన పోకల విజయ్ కుమార్, ఇటుకలపల్లికి చెందిన బోయ నందిని ప్రేమించి పెళ్లి చేసుకుని రాప్తాడులోని బీసీ కాలనీలో నివాసముంటూ వచ్చారు. కొంత కాలంగా నందిని ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న విజయ్‌కుమార్ రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని ఆమెతో గొడవపడేవాడు. ఈ నెల 16న నందినితో గొడవ పడి కట్టెతో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. చుట్టుపక్కల వారు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఈ నెల 17న ఆమె మృతి చెందింది. హతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం పక్కా ఆధారాలతో విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



అమీనాతాజ్‌ను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి జోనల్ ఓపెన్ చాంపియన్‌షిప్–2025 స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో నగరంలో అస్సార్‌వీధికి చెందిన ఏడేళ్ల చిన్నారి అమీనాతాజ్ ప్రతిభ చాటింది. రెండు వెండి పతకాలు సాధించింది. సత్తా చాటిన చిన్నారిని కోచ్‌లు నాగేంద్ర, హేమంత్, అఖిల్, అనిల్, ఆనంద్ అభినందించారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం రూరల్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీఓ కేశవనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు. బదిలీల విషయంలో రాజకీయ ప్రమేయం లేకుండా సీనియారిటీ ప్రకారం బదిలీలు చేపడితేనే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో ఎల్‌బీ నగర్‌లో నివాసముంటున్న ఆనంద్ కుమార్ (50) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. అరవింద నగర్‌లో ఎస్‌కేడీ స్కూల్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఈయన ఈనెల 17న స్కూల్ నుంచి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఫలితం లేకుండా పోయింది. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.